# శ్రీశ్రీశ్రీ సద్గురు భం భం బాబా వారి

## 56 వ ఆరాధనోత్సవాల ప్రత్యేక సంచిక

భం



ధర్మసారధి

మార్చి, 2025 సంచిక : 63

# శత్రువులను అరికట్టేవారు ఎవరు ?

ఈ ప్రపంచంలో బాహ్యంగా కనబడే శత్రువులను పట్టుకోవాలంటే పోలీసువాళ్ళున్నారు. ప్రభుత్వాన్ని నడిపే అధికారులున్నారు. బాహ్యంగా కనబడే శత్రువులను వీళ్ళు పట్టుకొంటారు, శిక్షిస్తారు. అయితే ఆంతరికంగా ఉండే శత్రువులను వీళ్ళు పట్టుకోలేరు, పట్టుకొనేదానికి వీళ్ళకి సాధ్యం కాదు.

మరి మనలోపల ఉండే అంతరంగిక శత్రువులను ఎవరు పట్టుకొంటారు అంటే ఆధ్యాత్మిక మార్గంలో నడిచే మహాత్ములు, ఆధ్యాత్మిక సంపత్తి కలిగి కాయా వాచా మనసా ఆ మార్గంలో నడిచే మహాత్ములు, సాధు సత్పురుషులు మాత్రమే మనలో ఉన్న అంతర్గత శత్రువులను పట్టుకొని బంధిస్తారు, శిక్షిస్తారు.



అయితే నేటి సమాజంలో బయట ఉన్న శత్రువులు, అలాగే లోపల దాగి ఉన్న శత్రువులు విచ్చలవిడిగా వీరవిహారం చేస్తున్నారు. దీనికి కారణమేమి అంటే ఈ రక్షకదళం వాళ్లు, ప్రభుత్వాధికారులు బయట విచ్చలవిడిగా తిరిగే శత్రువుల యొక్క ప్రలోభాలకు లొంగిపోయినారు. ఈ అధికారులు, వాళ్ళు ఇచ్చే లంచాలను తీసుకొని మంచం మీద పడుకొంటున్నారు. బాహ్య శత్రువులకు బానిస అయిపోయినారు.కనుక బాహ్య ప్రపంచంలోని శత్రువులను అరికట్ట లేకపోతున్నారు. ఈ పోలీసువాళ్ళు, ప్రభుత్వ అధికారులు లంచాలు తీసుకోకుండా నిజాయితీగా ఉంటే బాహ్యంగా ఉండే శత్రువులను అరికట్టగలరు.

అలాగే నేటి సమాజంలో ఉన్న ఈ ఆధ్యాత్మిక గురువులు కూడా మనిషి లోపల ఉన్న అంతర్గత



శత్రువులను అరికట్టలేక పోతున్నారు. ఎందుకంటే నేటి ఆధ్యాత్మిక గురువులు కూడా లౌకిక విషయాలలో పడి ఆ లౌకిక సుఖాలకు, ఆనందాలకు బానిసలయిపోయి తమ పేరు ప్రతిష్ఠల కొరకు, తమ పేరు ముందుకు రావాలి, తమ ఆశ్రమం ముందుకు రావాలి. ప్రతి రోజు నా పేరు పేపర్లో రావాలి, ఈ రోజు ఉపన్యాసం ఇస్తే రేపు నా పేరు, ఫోటో పేపర్లలో రావాలి, రాష్ట్రమంతటా, దేశ మంతటా నా పేరు వెలుగొందాలి, ప్రపంచంలో నేనే గొప్ప ఆధ్యాత్మిక గురువుగా చెలామణి అవ్వాలి అనే భావనలలో ఉన్నారు, ఆ భావంతోనే బ్రతుకుతున్నారు. అంతేకాని వారి దగ్గరకు భక్తితో వస్తున్నటువంటి శిష్యుల ,భక్తుల యొక్క అంతర్గత శత్రువులను నాశనం చేసి ఆ శిష్య భక్తాదులను మంచి మార్గంలో, ఆధ్యాత్మిక మార్గంలో ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలి అనే ఆలోచనే

చేయడం లేదు నేటి గురువులు.

కనుక శిష్యభక్తాదులారా! బాహ్యలోకంలో ఉన్న శత్రువులను అరికట్టే అధికారులు నిజాయితీగా పని చేయడం లేదు. అలాగే అంతర్గత శత్రువులను అరికట్టే ఆధ్యాత్మిక గురువులు సరిగా లేరు. మరి ఈ సమాజం, ఈదేశం ఎలా బాగుపడుతుంది? కనుక మీరందరూ కూడ మీ బిడ్డలను నిజాయితీగల అధికారులుగా తయారు చేయండి అలాగే అంతర్గత శత్రువులను నిరోధించే మంచి సాంప్రదాయ బద్ధంగా నడుచుకొనే ఆధ్యాత్మిక గురువులను ఆశ్రయించవలెనని విన్నవిస్తున్నాను.



శ్రీశ్రీ సద్గురు బాబా అన్నదానంద వారి వేదాంతోపన్యాసము నుండి గ్రహింపబడినది.